

## నలుగురికి ఎంపిడిఒలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖల పరిధిలో సూపరింటెండెంట్ కేడర్‌లో పనిచేస్తున్న నలుగురికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం తరపున ఆ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో డ్వామాలో పనిచేస్తున్న కె.వి ప్రసాద్, జిల్లాపరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న బిబి మిశ్రోలకు కోనసీమ జిల్లాలో ఎంపిడిఒలుగా నియమించారు. నరసన్నపేట మండల పరిషత్‌లో సూపరింటెండెంటుగా పనిచేస్తున్న ఆర్.తిరుపతిరావును ఏలూరు జిల్లాకు, జిల్లాపరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎం.వి రంగారావును అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయిస్తూ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై సమరభేరి

- పలుచోట్ల సంతకాల సేకరణ
- 4న మండల కేంద్రాల్లో ధర్నా
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన సమరభేరి కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సంతకాల సేకరణ, కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని పలు వార్డుల్లో సంతకాల సేకరణ, ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ సమరభేరిలో భాగంగా ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 4న అన్ని మండల కార్యాలయాల వద్ద చేపట్టే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ పాల్గొంటారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో, అధిక ధరలు అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. మోడీ ప్రభుత్వానికి అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు తప్ప దేశ ప్రజల కష్టాలు పట్టడం లేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజానీకం జీవనం కష్టంగా మారిందన్నారు. 2014లో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం, ఉద్యోగాలు ఇవ్వలేదు సరే కదా పరిశ్రమలు మూతపడి లక్షలాదిమంది ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రజలపై పన్నుల భారాల మోపుతూ, కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల రాయితీ ఇస్తోందని విమర్శించారు.

ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీనిచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఆ హామీని గాలికొదిలేసి ఏడుసార్లు పెంచారని చెప్పారు. ఇప్పుడు నెలవారీ పెంపుదలకు రంగం సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. పెంచిన ఛార్జీలను వెంటనే ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కేరళ తరహాలో జీడి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, టి.తిరుపతిరావు, అమ్మన్నాయుడు, ఎ.మహాలక్ష్మి, ఎ.సత్యం, ఎం.గోపి, కె.సూరయ్య, కె చంద్రశేఖర్, పాణి గ్రహణం, బి. సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, నిమ్మక అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పలాసలో తిలక్‌నగర్, సూదికొండ తదితర వార్డులలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.గణపతి, ఎన్.ఢిల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, ఎం.లావణ్య పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరులో చేపట్టిన సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎన్.మోహనరావు, నాయకులు బమ్మిడి ఆనందరావు, బి.రామకృష్ణ, తమ్మినాన భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట మండలంలోని మామిడిపల్లిలో సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, వేమన్న, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం : ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు


కొత్తూరు : సంతకాలను సేకరిస్తున్న సిపిఎం నాయకులు


పలాస : సంతకాలను సేకరిస్తున్న సిపిఎం నాయకులు


మాట్లాడుతున్న కలెక్టరు శ్రీకేష్ లాఠకర్

# ఓటర్ల జాబితాల్లో సమస్యలుంటే ముందుకు రావాలి

## రాజకీయ పార్టీలకు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఓటర్ల జాబితాల్లో బూత్ స్థాయిలో సమస్యలుంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ రాజకీయ పార్టీలను కోరారు. కలెక్టరేట్ వివిధ రాజకీయ పార్టీలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసన సభ నియోజకవర్గాల వారీగా ఈ నెల 28 నాటికి జిల్లాల్లో 18,07,713 ఓటర్లు నమోదై ఉన్నట్టు తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి 28 వరకు చేర్పులు, తొలగింపులు చేపడుతున్నట్టు తెలిపారు. చేర్పులు (ఫారం-6) 5152, తొలగింపులకు (ఫారం-7) 2644, దిద్దుబాట్లకు (ఫారం-8) 3324 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. పోలింగ్ స్టేషన్లు దూరంగా ఉన్నా, పాడైనా, అలాంటి వాటికి మార్పులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొలగింపుల ప్రక్రియకు సంబంధించి బిఎల్‌ఎలకు సహకరించాలని కోరారు. ఓట్ల తొలగింపులు, చేర్పులలో ఎలాంటి అపోహలకు తావు లేదని, ఎక్కడైనా ఓట్లు తొలగింపులు, చేర్పులలో, అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదు చేస్తే సంబంధిత వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీల వారు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి, మురళి కృష్ణ, వైసిపి నుంచి రౌతు శంకరరావు, టిడిపి నుంచి పిఎంజె.బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, బియస్పీ నుంచి ఎల్.సోమేశ్వరరావు, బిజెపి నుంచి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి జీడి పరిశ్రమల బంద్

- వ్యాపారి,కార్మికుడి ఘర్షణ
- ఆ నెపంతో పరిశ్రమల మూతకు నిర్ణయం


మాట్లాడుతున్న సురేష్ కుమార్

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ ప్రాంతంలోని జీడి పరిశ్రమలను గురువారం నుంచి బంద్ చేస్తున్నట్లు వ్యాపారులు ప్రకటించారు. జీడిపప్పు ఉత్పతి దారుల సంఘం కార్యాలయం భవనంలో బుధవారం నిర్వహించిన పలాస క్యాష్యూ మర్చెంట్ అసోసియేషన్ (పిసిఎంఎ) సమావేశం ఈ నిర్ణయం వెల్లడించింది. పొట్నూరు బాలాజీకి చెందిన ఓ పరిశ్రమలోని కార్మికుడు దొంగతనానికి పాల్పడి, తిరిగి తమ సభ్యుడిపైనే దాడి చేశారన్నది సంఘం నాయకుల ఆరోపణగా ఉంది. అయితే అసలు కథ వేరుగా ఉన్నట్లు ఆ ప్రాంతంలో చర్చ నడుస్తోంది. జీడిపప్పు మద్దతు ధర, కొనుగోళ్లపై రైతులు చేపట్టిన ఉద్యమం తీవ్ర స్థాయికి చేరుకుంటోంది. రైతులకు మద్దతు ధర కల్పించడంపై ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందిస్తోందని మంత్రులు సైతం ఇటీవల ప్రకటించారు. మద్దతు ధరపై రోజురోజుకీ వ్యాపారులపై ఒత్తిడి పెరుగుతోంది. రైతులు కోరుతున్న మద్దతు ధరకు జీడి కొనడానికి ఇష్టం లేని వ్యాపారులు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సాధారణంగా ఒక చోట పని చేసే క్రమంలో వ్యాపారికి,కార్మికుడి మధ్య ఏదో ఒక అంశంలో ఘర్షణ చోటు చేసుకోవడం సహజం. దానినే వారు భూతద్దంలో చూపి పరిశ్రమలు మూసేందుకు నిర్ణయించారని కార్మికులు చెప్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో ఒకసారి బంద్ చేశారు. ఆర్థిక మాంద్యం, కొనుగోలు లేకపోవడం కారణాలని చెప్పిన వ్యాపారులు తర్వాత మాట మార్చారు. రైతులు జీడిపిక్కలకు ఎక్కువ ధర అడగడం వల్ల వ్యాపారాలు సాగక మూసేసామని తర్వాత చెప్పారు. అప్పటికీ జీడి రైతుల ఆందోళన కొనసాగుతోంది. ఆ తర్వాత జీడి ఉద్యమం మరింత ఊపందుకుంది. బంద్ నిర్ణయం వెనుక కారణం ఇదే అన్న చర్చ ఆ ప్రాంతంలో నడుస్తోంది. బాధిత వ్యాపారి బాలరాజు మాట్లాడుతూ రూ.10 లక్షల విలువైన జీడి పప్పు రెండేళ్లలో మాయమైందని పోలీసులకు పిర్యాధు చేశారు. మరి ఇన్నాళ్లు ఆ వ్యాపారి ఏం చేస్తున్నట్లు అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి

**బంద్‌కు అంతా సహకరించాలి**

పిసిఎంఎ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్ మాట్లాడుతూ తమ సభ్యుడిపై కార్మికుడు దాడి చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. దొంగతనం ఆరోపణలపై ప్రశ్నించడమే నేరమా అని ఆయన ప్రశ్నించారు. తమ బంద్‌కు అంతా సహకరించాలని కోరారు. నష్టపోయిన వ్యాపారికి సంఘీభావం తెలుపుతున్నామని, విషయం తేలేవరకు బంద్ చేస్తామని చెప్పారు. పిసిఎంఎ కార్యదర్శి పట్నాన రవికాంత్, సంఘ సభ్యులు మల్లా భాస్కరరరావు, బెల్లాల నారాయణరావు, కొత్తకోట తిరుమలరావు పాల్గొన్నారు.

# దిశ పోలీస్‌స్టేషన్ తనిఖీ


మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వార్షిక తనిఖీల్లో భాగంగా దిశ పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి జి.ఆర్ రాధిక బుధవారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని సౌకర్యాలు, ముఖ్యమైన రికార్డుల నిర్వహణలపై లోతుగా పరిశీలించి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. దిశ పోలీస్‌స్టేషన్‌లో ఉమెన్ రిసెప్షన్ సెంటర్, కౌన్సెలింగ్ గది, వెయిటింగ్ షెల్టర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ దిశ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడం ముఖ్య ఉద్దేశం మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ, భద్రత కల్పించడమన్నారు. అందుకనుగుణంగా ప్రతిఒక్కరూ నీతి, నిబద్ధతతో విధులు నిర్వర్తించి మహిళలకు భద్రత కల్పించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో ముఖ్యంగా మహిళలపై మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. పాఠశాల, కళాశాల వద్ద దిశ బీట్ సిబ్బంది వాహనాలతో గస్తీ నిర్వహించి ర్యాగింగ్ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దిశ యాప్‌పై మహిళలు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. స్పందన పిటిషన్లు, ముఖ్యమైన కేసుల దర్యాప్తుపై దృష్టిసారించాలన్నారు. తనిఖీలో దిశ పోలీస్‌స్టేషన్ డిఎస్‌పి ఎస్.వాసుదేవ్, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ప్రభుత్వం మోకాలడ్డు

- తన కోటా నిధుల పనులపై ఎందుకంత కక్ష
- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు


మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజా సంక్షేమం, వనరుల కల్పనలో భాగంగా చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం మోకాలడ్డుతోందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. తన కోటా నిధులను వెచ్చించే విషయంలో ఉద్దేశపూర్వకంగానే ఆటంకాలు సృష్టిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ప్రణాళికా అధికారి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై సమీక్షలో ఆయన మాట్లాడారు. పనుల పురోగతిపై పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, ఐటీడీఏ, ఇతర శాఖల అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ ఆశించిన స్థాయిలో ఎంపీ నిధుల సద్వినియోగంలో డిజిటలైజేషన్ ప్రక్రియతో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. అయితే గతంలో ఎన్నడూ లేని తరహాలో ప్రజలకు వనరులు సమకూర్చే విషయంలో ఇబ్బందులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటి వరకు దాదాపు రూ.13 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నామని, కానీ.. వీటి అమలులో రాజకీయ దురుద్దేశాలను అంటగడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, అధికార పార్టీ నాయకులు ఈ తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

# కార్డ్‌ప్రైమ్ 2.0 విధానంపై కన్నెర్ర

- జిల్లాలో పలుచోట్ల దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్‌తో నిరసన
- ఆచరణలోకి వస్తే జీవనోపాధికి ఇబ్బందులే
- నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్


పొందూరులో నిరసన వ్యక్తం చేస్తున్న దస్తావేజు లేఖర్లు

**ప్రభుత్వం తీసుకున్న కార్డ్‌ప్రైమ్ 2.0 విధానంపై దస్తావేజు లేఖర్లు కన్నెర్ర చేశారు. ఈ విధానం అమల్లోకి వస్తే వేలాది మంది బతుకులు వీధిన పడతాయని భయాందోళనలు వ్యక్తం చేశారు. మా వేదనను సర్కారు దృష్టికి తీసుకువెళ్లాలని రిజిస్ట్రార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు వినతిపత్రాలు అందజేశారు. తమ వినతిని పెడచెవిన పెడితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.**

**పొందూరు :** ప్రభుత్వం తీసుకువస్తున్న కార్డ్‌ప్రైమ్ 2.0 విధానాన్ని నిరసిస్తూ పొందూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బుధవారం దస్తావేజు లేఖర్లు నిరసన తెలుపుతూ పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దస్తావేజు లేఖర్లు సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు పైడి రాంప్రసాద్, బలివాడ సత్యనారాయణలు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువస్తున్న ఈ విధానంతో రాష్ట్రంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న లేఖర్లు, డీటీపీ ఆపరేటర్లు, తమ జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడతారని అన్నారు. రెండు రోజులుపాటు ఈ పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం తీసుకువస్తున్న కార్డ్‌ప్రైమ్ 2.0 విధానం వలన తలెత్తే సమస్యలను, ఇబ్బందులను రాష్ట్ర ప్రజల దృష్టికి తీసుకువెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, కె.ప్రసాదరావు, వి.ఎస్.పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

**పలాస:** కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎదుట కూడా నిరసన తెలిపారు. అనంతరం కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ ఎస్. తవిటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షులు రవి కుమార్, పట్నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు నర్తు ధనుంజయరావు, జయరాం, ఎల్. గోవిందరావు, శిష్టు. శ్రీనివాస్, శ్యామ్ పట్నాయక్, వెంకటేష్, బివిఎన్ రావు, లండ సురేష్ దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

**టెక్కలి రూరల్**: ఆ విధానం ఆచరణలోకి వస్తే అమ్మకందారులకు మనుగడ లేదని సబ్ రిజిస్ట్రారు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి రామారావు, శాసనపురి లవ కుమార్, అంప్లాం శివప్రసాద్, బుడంకాయల అభిలాష్, దోగాన నీలాచలం, శాసనపురి వెంకటరమణ, దస్తావేజు లేఖరులు పాల్గొన్నారు.


టెక్కలి రూరల్ : వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు


ఆమదాలవలస : కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

**ఆముదాలవలస :** పట్టణంలోని డాక్యుమెంటరీ రైటర్ సంఘం నాయకులు సభ్యులు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఇటువంటి లోపభూయిష్టమైన ప్రైమ్ 2 విధానాన్ని నిలిపివేయాలని తెలిపారు. అనంతరం సబ్ రిజిస్టర్ బి. అరుణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ కె.పెద్దిరాజు, ఆర్. నాగరాజు, బి. శ్రీనివాసరావు, పి. నాగరాజు, ఎం. సురేష్, చింతాడ లక్ష్మణరావు, సువ్వారి రాజు,పి. ప్రభాకర రావు, ఎం. వేణు,పి. రవి, జి.ఢిల్లేశ్వరరావు, బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం అర్బన్ :** కార్డు ప్రైమ్ 2.0 విధానం ప్రవేశపెట్టే యోచన ప్రభుత్వం చేస్తుందని, దీనివల్ల అన్ని విధానాలా అనర్థమేనని జిల్లా డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న శాంతిశ్రీ

## ఐసిడిఎస్ పీడీగా శాంతిశ్రీ

**శ్రీకాకుళం అర్బన్ :** జిల్లా స్త్రీ, శిశుసంక్షేమశాఖ పథక సంచాలకులు బగాది శాంతిశ్రీ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆమె గతంలో జిల్లాలో డిఆర్‌డిఎగా పని చేసి మామ్మశాఖకు బదిలీ అయ్యారు. ఎట్టకేలకు ప్రభుత్వం ఆమెను ఐసిడిఎస్ పీడీగా నియమించింది. ఇప్పటి వరకు పీడీగా రెవెన్యూ శాఖ నుంచి స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా ఉన్న జయదేవి అదనపు బాధ్యతలు చూసుకునేవారు. ఆమె స్థానంలో శాంతిశ్రీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా కలెక్టర్‌కు శాంతిశ్రీ రాఖీ కట్టారు.

# కరుణించని వరుణుడు

**అప్పుడప్పుడు... అక్కడక్కడా చిటపట చినుకులు పడి చుట్టం చూపుగా పలుకరించి వెళ్లిపోవడంతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. కారుమబ్బులు వారానికి రెండు, మూడుసార్లు కమ్ముతున్నా ఆ స్థాయిలో వర్షం కురవకపోవడంతో ఆశతో ఎదురుచూసిన అన్నదాతలు ఉసూరుమంటున్నారు. అడపాదడపా పడిన వర్షంతో దమ్ములు పట్టి వరినాట్లు వేయలేక... అలా అని మౌనం వహించలేక సంకట పరిస్థితిలో పడిపోతున్నారు. కళ్లముందే కాలం కరిగిపోతుండడంతో కర్షకుల మదిలో కల్లోలం ప్రారంభమైంది.**

- సాగు అంతంతమాత్రమే
- నత్తనడకన ఈ-క్రాప్
- దిగజారుతున్న అన్నదాత పరిస్థితి

ప్రజాశక్తి - కవిటి

ఖరీఫ్ కష్టాలు అన్నదాతను చుట్టుముడుతున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చుక్క నీరు లేక అన్నదాత కంటనీరు పెడుతున్నాడు. కనీసం అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించి ఏదో విధంగా సాగు చేద్దామని ప్రయత్నించిన వీరి ఆశలను వరుణుడు ఆడియాసలు చేస్తున్నాడు. గత కొన్ని నెలలుగా ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రైతులు వేసిన నాట్లు ఎండిపోతున్నాయి. మరికొందరి నారుమడులు పశువుల మేతగా మారుతున్నాయి. ఇటువంటి దయనీయ పరిస్థితుల్లో చుక్క నీరు కోసం అన్నదాత ఆతతగా ఎదురుచూస్తున్నాడు.

**సాగు అంతంతమాత్రమే...**

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 33,331 ఎకరాల సాగుభూమికి కేవలం 16,731 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అందులోనూ సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో అయితే పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కంచిలి మండలంలో కేవలం 7.3 శాతం వ్యవసాయ భూమిలో మాత్రమే నాట్లు వేయగా, సోంపేటలో 20 శాతం, ఇచ్ఛాపురంలో 20.1 శాతం వ్యవసాయ భూమిలో నాట్లు పడ్డాయి. ముఖ్యంగా సాగునీటి సదుపాయం లేకపోవడం, తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం వ్యవసాయం కష్టమవుతోంది. ఇప్పటికే ఆగస్టు నెల పూర్తికావస్తున్నా వరినాట్లు పడకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షాభావ పరిస్థితులతో...**

గత ఏడాదిగా ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితులు రైతాంగ వ్యవస్థపైనే తీవ్రమైన ప్రభావం చూపిస్తున్నాయి. దీంతో వ్యవసాయ, ఉద్యాన పంటలు కోలుకోలేని విధంగా దెబ్బతింటున్నాయి. అక్కడక్కడా బోరు నీటితో సాగుచేసినా ఫలితం లేకపోతోంది. దీంతో రైతులు తీవ్రమైన ఒత్తిడికిలోనవుతున్నారు.


నారుమడిలో మేత మేస్తున్న పశువులు

**ఈ-క్రాప్ సమస్యలు**

మరోవైపు ఈక్రాప్ సమస్యలు అటు ఉద్యోగుల్ని, ఇటు రైతుల్ని పీడిస్తున్నాయి. సర్వర్లో సమస్యలో లేకా నెట్‌వర్క్ సమస్యలో కానీ నియోజకర్గస్థాయిలో కేవలం 4,935 ఎకరాల్లో మాత్రమే ఈ-క్రాప్ జరిగిందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తెలుస్తోంది. స్థానిక సచివాలయ సిబ్బంది ఈ-క్రాప్ చేయడానికి ప్రయత్నిస్తున్నా, సాంకేతికంగా సమస్యలు ఎదురవుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై సచివాలయం సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

### సాగు భారంగా మారింది



ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ భూమి సాగు చేయడం భారంగా మారుతోంది. నేను ఎకరా భూమి కౌలుకు తీసుకొని సాగు చేశాను. ఇప్పటివరకు రూ.18 వేలు ఖర్చు చేశాను. మరో వారం, పది రోజులు ఇదే వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే పంట ఎండిపోవడం ఖాయం. అదే జరిగితే మరోసారి కౌలుకు తీసుకోవడానికి వెనుకడుగు వేయక తప్పదు. ఏదేమైనా వ్యవ'సాయం' కరువవుతోంది. సాగు భారమవుతోంది.

**- నర్తు లోకనాథం**
**కౌలు రైతు, రామయ్యపుట్టుగ**

ప్రజాశక్తి
www.prajasakti.com




## ఆ వ్యాఖ్యలతో తెలుగు ప్రొఫెసర్‌కు సంబంధం లేదు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం**

తెలుగు భాషా వారోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న నిర్వహించిన కార్యక్రమంలో పాలకులపై చేసిన విమర్శలతో అంబేద్కర్ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఉదయ్ కిరణ్‌కు సంబంధం లేదని గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె.మూర్తి చెప్పారు. తెలుగు భాష దుస్థితికి పాలకులే కారకులంటూ ప్రజాశక్తి జిల్లా పేజీలో ఈ నెల 29న వచ్చిన శీర్షికతో వచ్చిన వార్తలో పాలకులను ఆయన నిందించినట్లు వచ్చిందన్నారు. వాస్తవానికి ఆ రోజు చాలా మంది వక్తలు పాల్గొన్నారని, అందరి ప్రసంగాలనూ క్రోడీకరించి ఇచ్చామని చెప్పారు. ఆ రోజు సభలో 'వ్యవహారిక భాష- సాహిత్యంపై దాని ప్రభావం' అంశంపై మాత్రమే ఆయన మాట్లాడారని తెలిపారు. ముఖ్య వక్తగా ఉదయ్ కిరణ్ పాల్గొన్నందున ఆయన పేరును ముందుగా ప్రస్తావించి ఉంటారని ఆయన అభిప్రాయ పడ్డారు.

## ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు అవసరం

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**


మాట్లాడుతున్న సన్యాసిరావు

అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రత పథకాల కోసం రూపొందించిన 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో కార్మికుల నమోదు అవసరమని, అర్హులైన వారందరూ నమోదు చేయించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు తెలిపారు. గార మండలం శ్రీకూర్మం గ్రామ సచివాలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండి అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు నమోదుకు అర్హులని తెలిపారు. జిల్లాలో నమోదు కార్యక్రమం కామన్ సర్వీస్ సెంటర్ వారిచే ప్రతి గ్రామంలోను నమోదు చేస్తారని, జిల్లాలో ఇంకా 1.25 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులు నమోదు కావలసి ఉందని, సమాజంలో ప్రతి వ్యక్తి బాధ్యత తీసుకొని అర్హులైన వారిని నమోదుకు ప్రోత్సహించాలని, నమోదు ఉచితంగా చేస్తామని, దీనికి సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు సహకరించాలని కోరారు. సభకు సర్పంచ్ గోరు అనిత, ప్రసాదరావు, ఉప కార్మిక కమిషనర్, గార తహశీల్దార్ జె.రామారావు, గార ఎంపిడిఒ రమణయ్య, స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ మజ్జి. సింహాచలం, సిఎస్‌సి జిల్లా కో-ఆర్డినేటర్ జి.వెంకటేష్, బరాటం శ్రీధర్, కార్యదర్శి శంకరరావు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

### ఎంపీ రామ్మోహన్ నాయుడు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

తెలుగువారి ఆత్మ గౌరవం, యుగ పురుషుడు నందమూరి తారక రామారావు అని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కషిని గుర్తిస్తూ.. భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రూ.100ల స్మారక నాణేన్ని ఇటీవల ఆవిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది తెలుగు ప్రజలకు దక్కిన గౌరవంగా అభివర్ణించారు. దీనికి మరింత ప్రాధాన్యత కల్పించేలా విశ్వవిఖ్యాత నట సార్వభౌమ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరారు.

# మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

### డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు


పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

**శ్రీకాకుళం అర్బన్:** జిల్లాలో ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కల పరిరక్షణకు ప్రత్యేక దృష్టిసారించాలని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని శిలగాం శింగువలసలో పళ్ల తోటల పెంపకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు అంతర పంటలు వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందాలని సూచించారు. ప్రతి మొక్క బతికే విధంగా సంరక్షణ చర్యలను చేపట్టాలని ఉపాధి హామీ ద్వారా మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణకు అవసరమైన నిధులు, ఎరువులను అందజేయనున్నట్లు తెలిపారు. ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా చెరువులు పంటకాలువ గట్లపై మొక్కల పెంపకం పనులతో పాటు రోడ్లకు ఇరువైపులా రెవెన్యూ ప్లాంటేషన్ వ్యక్తిగత పళ్లతోటల పెంపకం వంటి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. భూమిపై మొక్కల శాతం తగ్గడం వల్ల మాత్రమే ఉష్ణోగ్రతలో గణనీయంగా మార్పులు వస్తున్నాయని, ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సీతారాం, ఇసి బాలముకుంద బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జీడి చెట్లకు నష్టరిహార చెక్కుల పంపిణీ

### సర్పంచ్‌కు అందని సమాచారం

**ప్రజాశక్తి- నౌపడ**


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు భూసేకరణలో భాగంగా రైతులు ఆధీనంలో ఉన్న జీడి చెట్లకు నష్టపరిహారంగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ బుధవారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. మూలపేట, విష్ణు చక్రం గ్రామాల నుంచి 120 మంది రైతులకు రైతులకు ఒక్కో మొక్కకు రూ. 2,500 చొప్పున లెక్క కట్టి చెక్కులను అందజేశామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి మొక్కకూ నష్టపరిహారం చెల్లించిందని అన్నారు. కొన్ని సాంకేతిక సమస్యలు, కుటుంబ సభ్యుల అభ్యంతరాలపై మరో పది మంది వరకు చెక్కులు పంపిణీ ఆలస్యం అవుతుందని తెలిపారు. ఉద్యానవన, రెవెన్యూ అధికారుల గతంలో సర్వే చేసినా పోర్టు సిబ్బంది పలుమార్లు పరిశీలించి నష్టపరిహారం అర్హుల జాబితాను తయారు చేసినట్లు తెలిపారు. గ్రామంలో నష్టపరిహార చెక్కులు పంపిణీ కార్యక్రమానికి సర్పంచ్ జీరు బాబూరావుకు అధికారులు సమాచారం ఇవ్వకపోవడంతో గైర్హాజరయ్యారు. తనకు సమాచారం ఇవ్వకపోవడంపై శ్రీనివాస్ తీరుపై విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

## పెరటి తోటల పెంపకంపై శిక్షణ

**సరుబుజ్జిలి :** పెరటి తోటల పెంపకంతో మహిళలకు అధిక ఆదాయంతో పాటు రక్తహీనతనూ నివారించవచ్చని కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్లు కిరణ్, సునీతలు అన్నారు. మండలంలోని ఇసకలపాలెంలో రిలయన్స్ ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త మహిళా రైతులకు పెరటి తోటలు ఏ విధంగా ఏర్పాటు చేయాలి అన్న అంశంపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్న మహిళలు చాలావరకు రక్తహీనతతో బాధపడుతున్నారని అన్నారు. కిచెన్ గార్డెనింగ్ శిక్షణలో భాగంగా ఐదు సెంట్లు భూమిలో 11 రకాల కూరగాయలను పండించడం, దాని వల్ల కలిగే ఉపయోగాలు, కూరగాయలను ఏ విధంగా పండించాలి, యాజమాన్య పద్ధతులు ఏ విధంగా చేపట్టాలన్న విషయాలపై క్షుణ్ణంగా వివరించారు. మహిళలకు వివిధ రకాలైన కూరగాయల విత్తనాలు రిలయన్స్ ఫౌండేషన్ సంస్థ ఉచితంగా ఇచ్చారు. భవిష్యత్‌లో తమకు తాముగా సొంతంగా కిచెన్ గార్డెన్ తయారు చేసుకుని సొంతంగా పౌష్టికాహారం తయారు చేసుకున్నట్లయితే చాలావరకు రక్తహీనతను అధిగమించవచ్చని అన్నారు. తమకు తాముగా పౌష్టికాహారం తయారు చేసుకోవడం వల్ల చాలావరకు ఇంటి ఖర్చులూ తగ్గించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శిల్ప, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు జి.తిరుమలరావు, సీపాన రాజారావు పాల్గొన్నారు.



శిక్షణ కల్పిస్తున్న శాస్త్రవేత్త సునీత

# అనుబంధానికి నిదర్శనం రాఖీ


కలెక్టర్‌కు రాఖీ కడుతున్న ఓంశాంతి సిస్టర్స్

### కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు సూచకంగా రక్షా బంధన్ అని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఓం శాంతి సిస్టర్స్ కలెక్టర్ కు రక్షా బంధన్ కట్టారు.. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జగన్మోహనరావు, ఓం శాంతి సిస్టర్స్ పాల్గొన్నారు.

### ట్రాఫిక్ పోలీసులకు రాఖీ

ఆప్యాయత, అనురాగం అనుబంధం కలయికతో ఉండే రాఖీ పండుగను ఎస్ఎఫ్ఐ విద్యార్థులు శ్రీకాకుళం పట్టణంలో వివిధ కూడళ్ల వద్ద ఉన్న ట్రాఫిక్ పోలీస్ సోదరులకు రాఖీ కట్టి సోదర భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా, అధ్యక్ష ఉపాధ్యక్షులు, రాజు, చందు, సభ్యులు సంతు, తిరుపతిరావు, రేవతి, హారిక, జ్యోతి, పాల్గొన్నారు.

## సాగునీరు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

**పలాస:** పలాస, వజ్రపుకొత్తూరు మండలాల శివారు భూములకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అసమర్థత వల్ల వంశధార అందడంలేదని జనసేన నియోజకవర్గం నాయకులు డాక్టర్ వి.దుర్గారావు విమర్శించా రు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెక్కలిలో అచ్చెన్నాయుడు, నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్ ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేయడం వల్లే శివారు భూములకు సాగునీరు అందించడం లేదన్నారు. శివారు భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార నీరు సరఫరా చేయకపోయినా రైతులు నుంచి నీటి తీరువా ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించారు. అనధికార ఎత్తిపోతల పథకాలను తొలగించకుండా కాలయాపన ఎందుకు చేస్తున్నారని మంత్రి అప్పలరాజును ప్రశ్నించారు. శివారు భూములకు సాగు నీరు అందించే వరకు జనసేన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రైతులకు వంశధార సాగునీరుపై నమ్మకం లేక ఊబాలు వేయకుండా ఎదలు వేస్తున్నారని ఈ విషయం మంత్రి సీదిరి అప్పలరాజు తెలుసుకోవాలన్నారు. ఆరుగాలం శ్రమించే అన్నదాతకు సాగునీరు అందించాల్సిన పాలకుల నిర్లక్ష్యంతోనే ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వంశ ధార శివారు భూములకు సాగు నీరు అందకపోవడం అన్నదా తలు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## యువకుడు ఆత్మహత్య


సాయికుమార్ (ఫైల్)

**కోటబొమ్మాళి:** కోటబొమ్మాళి పంచాయతీ ప్రకాశనగర్ కాలనీకు చెందిన డబ్బీరు సాయికుమార్ (28) బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే... మృతుడు డబ్బీరు సాయికుమార్ తండ్రి నాగేశ్వరరావు సుమారు 20 ఏళ్ల క్రితం మృతి చెందడంతో తన మేనమామ కృష్ణపాత్రుని వెంకటరావు వద్ద సాయికుమార్ తల్లి లక్ష్మితో పాటు నివాసముంటున్నాడు. సాయికుమార్ ఐటిఐ వరకు చదువుకొని ఆపై చదువులు ఇష్టం లేక చదువును ఆపేసి వ్యాన్ డ్రైవర్‌గా పనిచేశాడు. ఇంతలో చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అయితే ఈ కారణంగా వ్యాన్ యజమాని కొద్ది రోజులు క్రితం పనిలోంచి తొలగించారు. అప్పటి నుంచి జులాయిగా తిరుగుతూ మద్యం తాగుతూ ఉండేవాడు. కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు మందలించినా సాయికుమార్‌లో మార్పు రాలేదు. అయితే యథావిధిగా మంగళవారం రాత్రి కూడా ఇంటికి చేరి పక్కన్న ఉన్న పెంకుటింటిల్లో పడుకున్నాడు. బుధవారం ఉదయం ఎప్పటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు లేపేందుకు వెళ్లి చూసేసరికి సాయికుమార్ చీరతో ఉరివేసుకొని వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ షేక్‌మహ్మద్‌అలీ ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అత్యాచార కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

**నౌపడ :** బాలికపై అత్యాచారం కేసులో మండలంలోని కె.లింగూడు పంచాయతీ ఎం.సున్నాపల్లికి చెందిన వ్యక్తికి 20 ఏళ్లు జైలు శిక్ష, రూ.20 వేలు విధిస్తూ శ్రీకాకుళం ఫోక్సో కోర్టు బుధవారం తీర్పునిచ్చిందని నౌపడ ఎస్ఐ కిషోర్ వర్మ తెలిపారు. 2019 ఫిబ్రవరి 16న బాలికపై అత్యాచారం అభియోగంపై నిందితుడిపై నౌపడ పోలీస్ స్టేషన్‌లో ఫోక్సో కేసు నమోదైందన్నారు. ఈ కేసుపై శ్రీకాకుళం ఫోక్సో కోర్టులో సుదీర్ఘ విచారణ అనంతరం ముద్దాయిగా తేలడంతో జీవిత ఖైదు విధించారని తెలిపారు.

## నందిగాం మాజీ సర్పంచ్ మృతి


కృష్ణస్వామి (ఫైల్)

**నందిగాం :** నందిగాం మాజీ సర్పంచ్ ప్రగడ కృష్ణస్వామి (83) ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుకలో అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. 1072, 82, 87 సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1987 సర్పంచ్‌తో పాటు మండల ఉపాధ్యక్షులుగా పనిచేశారు. ఈయన హయాంలో నందిగాంను అభివృద్ధి చేయడంతో అందరి మన్ననలు పొందారు. ఉన్నత చదువులు చదివి తన గ్రామానికి ఏదో చేయాలని సంకల్పంతో అభివృద్ధికి కృషి చేశారు.


శస్త్రచికిత్సల కోసం బస్సులో తరలింపు


## నేత్రాలపై అప్రమత్తం

**ప్రజాశక్తి-రణస్థలం**

నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని కళ్యాణి నేత్ర ఆస్పత్రి పారామెడికల్ అప్తాలమిక్ ఆఫీసర్ (విజన్ టెక్నీషియన్) ఎస్.కళ్యాణి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం కళ్యాణి కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి 110 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 25 మందికి కంటి శస్త్రచికిత్సకు ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్సులో తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ మనిషి జీవితంలో కళ్లకు ఉన్న ప్రాధాన్యత ఓ ప్రత్యేకమని అన్నారు. ఎక్కువ మంది జీవితం చీకటిమయం కావడానికి కంటి శుక్లాలు కారణంగా చెప్పవచ్చునని అన్నారు. ఇంటికి వెళ్లే సమయంలో శస్త్రచికిత్స చేసిన కంటిపై ప్యాడ్, ప్లాస్టిక్ షీల్డు అలాగే ఉంచాలని, ఒక రోజు తర్వాత దానిని తీసివేయాలని సూచించారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**మందస:** మండలంలోని మఖరజోలలో కొండల శ్రీధర్ మాస్టర్ మాతృమూర్తి, హరిపురంలో టిడిపి సీనియర్ నాయకులు అగ్గన్న జగన్నాయకులు సతీమణి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి శివాజీ పరామర్శించి మృతుల కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇందుకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నా రు. వారితో పాటు మండల పార్టీ అధ్యక్షుడు బావన దుర్యోధన, ప్రధాన కార్యదర్శి లబ్బా రుద్రయ్య, రట్టి లింగరాజు, దాసరి తాతారావు, బైరిసెట్టి గున్నయ్య, బమ్మిడి కర్రెయ్య, మామిడి తాతారావు, కుప్పిలి వెంకట రావు, అగ్గన్నా జయరాజు తదితరులున్నారు.


పరామర్శిస్తున్న శిరీష, శివాజీ

## సంక్షిప్త వార్తలు

### మహిళాభివృద్ధికి ప్రాధాన్యం

**ఇచ్ఛాపురం :** మహిళాభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు రక్షాబంధన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు 'జగనన్న రక్ష' అనే అక్షర క్రమంలో కూర్చుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల దివ్యభారతి, లాభాల స్వర్ణమణి, ఎంపిపి బోర పుష్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ చాట్ల సుజాత, బలివాడ ప్రకాష్ పట్నాయక్ పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన సుడా కార్యదర్శి

**శ్రీకాకుళం** : సుడా కార్యదర్శి ఎంవి లక్ష్మి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ ను కలెక్టర్ కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె గత శుక్రవారం సుడా కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం విఎంఆర్డ్‌ఎ నుంచి బదిలీ అయి ఇక్కడ విధుల్లో చేరారు.

### నేడు సంఘీభావ పాదయాత్ర

**పలాస:** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం సంఘీభావ పాదయాత్రకు సంఘీభావంగా మండలంలోని మామిడిపల్లి నుంచి నీలావతి వరకు గురువారం ఉదయం 10 గంటలకు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పాదయాత్ర చేయనున్నారని మండల పార్టీ అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. లోకేష్ 200 రోజుల్లో 2,500 కిలోమీటర్ల పాదయాత్ర చేశారని అన్నారు. ఆయనకు సంఘీభావంగా 2.5 కిలోమీటర్ల శిరీష పాదయాత్ర చేయనున్నారని తెలిపారు. నియోజకరవ్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొవాలని కోరారు.

**ఆమదాలవలస :** లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా గురువారం పాదయాత్ర నిర్వహిస్తున్నామని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వెంకటేశ్వర కళ్యాణం మండపం నుంచి రైల్వే స్టేషన్ వరకు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ఉచిత మందులు పంపిణీ చేయాలి

**నందిగాం :** జిల్లాలోని గొర్రెలకు, మేకలకు సీజన్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా ఉచితంగా మందులను పంపిణీ చేయాలని ఎపి గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన సాంబమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ఏడాదికి నాలుగు సార్లు నట్టల నివారణ మందుల పంపిణీ చేయాల్సి ఉన్నా... కేవలం రెండుసార్లు మాత్రమే పంపిణీ చేస్తున్నా రని అన్నారు. వ్యాధులను దృష్టిలో పెట్టుకొని వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వ్యాక్సినేషన్ వేయాలని కోరారు. గొర్రెలు, మేకలు మోత కోసం బంజరు భూములు, చెరువు గర్భాలు, తుమ్మ చెట్లను కేటాయించాలన్నారు. నాబార్డు ద్వారా ఒక్కొక్కరికీ రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు.

### యువ టీమ్ ఆర్థికసాయం

**రణస్థలం రూరల్ :** మూడంతస్తుల మేడ పైనుంచి ఇటీవల జొన్నాడ దుర్గారావు కాలుజారి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నాడు. విషయం తెలుసుకున్న యువ టీమ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉద్వల అంజిబాబు ఆధ్వర్యాన రూ.17 వేలు విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని దుర్గారావు తల్లి జొన్నాడ పార్వతికి బుధవారం అందజేశారు. మేము చేసే సేవా కార్యక్రమానికి స్పందిస్తున్న దాతలు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి పచ్చిగుళ్ల సాయిరాం, వడ్డి రమణ, అన్నంనాయుడు పాల్గొన్నారు.

### పశువులకు దాణా పంపిణీ

**సోంపేట:** బారువాల్లోని బాలాజీ గోశాలకు సోంపేట రోటరీ క్లబ్ సభ్యులు చేయూత అందించారు. ఈ మేరకు బుధవారం రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యాన గోశాలకు 10 బస్తాల దానాతోపాటు అటుకులను అందజేశారు. సోంపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో కె.తిరుపతి అనే వ్యక్తికి అత్యవసరంగా ప్లేట్లెట్స్ అవసరం కాగా రోటరీ క్లబ్ సభ్యులు స్పందించారు. శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి ఆర్ యూనిట్లు తెప్పించి రోగికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు వి శివశంకరరావు, టి బాబు, పి మధు, ఎం శ్రీనివాసరావు, వి తిరుపతి, కె తిరుమలరావు, బి లింగ రాజ్, రోటరాక్ట్ అధ్యక్షుడు జి బెనర్జీ, మనీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### వివాదాస్పద స్థలంలో స్తంభాల తొలగింపు

**రణస్థలం రూరల్ :** మండల కేంద్రంలో రావాడ రోడ్డులోని సర్వే నంబరు 2-1లో ఉన్న స్థలంలో అక్రమణదారులు ఏర్పాటు చేసిన స్తంభాలను స్థానిక మహిళలు, గ్రామస్తులు బుధవారం తొలగించారు. ప్రభుత్వ భూమిని ఎలా ఆక్రమించుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ కార్యాలయం వద్దకు చేరుకొని వివాదస్పద స్థలానికి విద్యుత్ మీటర్ ఎలా ఇచ్చారని విద్యుత్ అధికారులను నిలదీశారు. తక్షణమే విద్యుత్ మీటర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ... ధర్నా చేపట్టారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి మీటంవున తొలగిస్తామని హామీనివ్వడంతో వివాదం సర్దుమణిగింది.

### పెద్దలంకాం సర్పంచ్ ప్రమాణ స్వీకారం

**బూర్జ :** మండలంలో పెద్దలంకం గ్రామంలో ఈ నెల 19వ తేదీన పంచాయతీ ప్రెసిడెంట్ ఉప ఎన్నికలు జరిగాయి. అందులో భాగంగా ఆ గ్రామానికి చెందిన కాగితాపల్లి గోవిందరావు 81 ఓట్ల మెజార్టీతో గెలిచిన విషయం తెలిసిందే. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి అరుణ ఆధ్వర్యంలో పంచాయతీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి టిడ్కో డైరెక్టర్ కే గోవిందరావు, వైఎస్సార్ సీనియర నాయకులు కె.జగన్, పెద్దపేట ఉప సర్పంచ్ డివిఎ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో అన్ని వయసులకు సమ ప్రాధాన్యం

### మాజీ మంత్రి అప్పల సూర్యనారాయణ

**ప్రజాశకి- శ్రీకాకుళం అర్బన్**


అప్పలసూర్యనారాయణ

చట్ట సభల్లో మహిళలకి, యువతకు, సీనియర్లకు... ఇలా అన్ని వర్గాల వారికీ సమ ప్రాధాన్యత ఉండాలని, అప్పుడే సత్ఫలితాలు వస్తాయని మాజీ మంత్రి, టీడీపీ నేత గుండ అప్పల సూర్యనారాయణ అన్నారు. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తెలుగుదేశం పార్టీలో మంత్రిగా, శాసన సభ్యులుగా, వివిధ కమిటీల చైర్మన్‌గా, సభ్యునిగా, స్థానిక సంస్థల్లో మున్సిపల్ కౌన్సిల్‌గా, వైస్ చైర్ పర్సన్ గా పని చేశానని, ఈ సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆరోపణలు లేకుండా బాధ్యతలు నిర్వర్తించానని అన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గం విషయంలో తన సతీమణి లక్ష్మీదేవి విషయంలో కొంతమంది ఆమె వయస్సుపై అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని, చాలా బాధ అనిపించిదన్నారు. ఈ ప్రశ్నకు సమాధానంగా తమ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు మాటలు ఊరటనిచ్చాయని అన్నారు. తన ఆలోచనలు బాబు ఆలోచనా విధానం ఒకే విధంగా ఉండడం కాకతాళీయమేనని అన్నారు. జాతీయ పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు వయసు, తన వయసు ఒకే విధంగా ఉన్నాయని, తనపై వయోభారం ప్రస్తావనలతో విమర్శలకు దిగుతున్నట్టుగానే, బాబుపై కూడా అధికార పక్షం విరుచుకు పడుతోందని...సేవకు వయసు అడ్డంకి కాదని అన్నారు. 'నితీష్ కుమార్', నవీన్ పట్నాయక్ కోసం ఎందుకు మాట్లాడరని చంద్రబాబునాయుడు నాయుడు అడిగిన ప్రశ్న తనకు ఎంతో ఆనందం కలిగించిందన్నారు.

# గణితంపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న వెంకటరమణ

**వజ్రపుకొత్తూరు :** గణితంపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించాలని మండల విద్యాశాఖ అధికారి-2 బి.వెంకటరమణ అన్నారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ చైర్మన్, స్థానిక ప్రధానోపాధ్యాయులు కె.హరిబాబు అధ్యక్షతన నిర్వహించిన పలాస, వజ్రపుకొత్తూరు మండలాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుల గణితం సబ్జెక్టు కాంప్లెక్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు గణితం ప్రాముఖ్యత వివరిస్తూ గణితం నేర్చుకోవాలనే ఆసక్తికరమైన బోధనను ఉపాధ్యాయులు అందించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ కాంప్లెక్స్ లో చర్చించిన విషయాలు పిల్లల సమగ్ర అభివద్ధికి దోహదపడే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. గరుడభద్ర ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు దిలీప్ సాహు 8వ తరగతి విద్యార్థులకు దత్తాంశ సేకరణ అనే భావనను మాదిరి పాఠ్య బోధన చేశారు. రిసోర్స్ పర్సన్స్ జి.గోపాలకృష్ణ, కిశోర్ గణిత భావనలను వివరించారు. రెంటికోట గణిత ఉపాధ్యాయులు రామారావు, క్రమబహుభుజికి సంబంధించిన సూత్ర నిరూపణలు, మెళకువలు తెలిపారు. సమావేశానికి 54 మంది గణిత ఉపాధ్యాయులు, రెండు మండలాల నుంచి హాజరయ్యారు. కార్యక్రమంలో మండల గణిత సెక్రటరీ చింత ఉమారావు, వెంకటరావు, నవీన్, సురేష్, సోమేశ్వరరావు, మాధవపాత్రో, జగన్ శోభారాణి, లక్ష్మి, జయలక్ష్మి, అన్నపూర్ణ సిఆర్‌పి ఎ.కృష్ణారావు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేత్రదానంతో ఇద్దరికి చూపు


మాట్లాడుతున్న భవానీశంకర్

**పలాస:** నేత్ర దానం చేయడం ద్వారా రెండు ప్రాణాలకు చూపునిస్తుందని పలాస ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవాని శంకర్ అన్నారు. పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువమంది కార్నియా అంధత్వంతో బాధపడుతున్నారని, అందులో ఎక్కువ శాతం చిన్నారులు, యువకులు ఉన్నారని చెప్పారు. నేత్రాలు దానం చేసేందుకు వయస్సుతో సంబంధం లేదన్నారు. ప్రతీ ఒక్కరు నేత్రాలు దానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన, డాక్టర్ కూర్మారావు, ఆప్తమిక్ అసిస్టెంట్ తారకేశ్వర రావు, హెడ్నర్స్ ఉమాదేవి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

**ప్రజాశక్తి- టెక్కలి రూరల్**

టెక్కలి నియోజకవర్గం వ్యాయామ ఉపాధ్యాయులందరికీ స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఇఒ-2 డి.చిన్నారావు, స్కూల్ హెచ్ఎం డి.నాగభూషణరావు, నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బి నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ స్కూల్ అసెంబ్లీ, ఎయిమ్స్ అండ్ గోల్స్, పిఇటి జాబ్ చార్ట్, యస్‌జిఎఫ్ఐ టోర్నమెంట్స్, కే లో ఇండియా రిజిస్ట్రేషన్ అండ్ ఫిట్నెస్, స్టూడెంట్ కెరియర్స్, స్పోర్ట్స్ పర్సనాలిటీ, యోగ, ఇతర వ్యాయామానికి సంబంధించిన విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల ఎంఎస్ఒలు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** విద్యార్థులకు క్రమశిక్షణ, మంచి ఆరోగ్యం అందేలా చూడాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఎంఇఒ కె.అప్పారావు అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో వ్యాయామ విద్యపై నియోజవర్గ స్థాయిలో స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కె.పద్మనాభరెడ్డి, నాలుగు మండలాల ఎంఎస్ఒలు వజీర్ అహ్మద్, కార్తీక్, కృష్ణ పుడియా, ఐ.కె.పండా పాల్గొన్నారు.

# వివేకానందుని విగ్రహం ధ్వంసం


ధ్వంసం చేసిన వివేకానంద విగ్రహం

**పొందూరు:** ఓ యువతా మేలుకో... అంటూ యువతను సన్మార్గంలో నడిచేలా స్ఫూర్తిదాయకమైన ఎన్నో సందేశాలు చేసిన మహనుభావుడు స్వామీ వివేకానంద. యువతకు ఆయనే ఆదర్శప్రాయుడు. అందుకే ఆయన పుట్టినరోజు సందర్భంగా మనమందరమూ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటాం. అటువంటి మహనుబావుని విగ్రహానికి అమానవీయంగా, అవమానకరమైన రీతిలో తిడుతూ, ధ్వంసం చేస్తూ మద్యం మత్తులో యువకులు దుశ్చర్యకు పాల్పడుతున్న వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు ఆరు నెలలు క్రితం పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న స్వామీ వివేకానంద విగ్రహాన్ని గంజాయి, మద్యం మత్తులో యువకుడు కర్రతో కొడుతూ, తిడుతూ, ఇసుక పోస్తూ, ఉమ్మి ఊస్తుండగా, మరో కొందరు యువకులు వీడియో తీస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. దిమ్మపై ఉన్న వివేకానంద విగ్రహాన్ని తొలగించి రోడ్డుపై పడివేశారు. దీనిపై పలు యువజన సంఘాలు, రాజకీయపార్టీలు, పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటన చూసి సమాజం ఎటు పోతుందంటూ వారంతా ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు పి.వి.రామరాజు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో ఆంతర్యం ఏమిటంటూ పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రస్తుతం ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కె.ఈశ్వరరావు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.